అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
ఆదివారం 30 ఏప్రిల్ 2023

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని తపాలాపూర్ గ్రామానికి చెందిన ఉప్పులేటి శేఖర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మండల కుమ్మరి సంఘం నాయకులు సంఘం ఆధ్వర్యంలో శనివారం బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. కుమ్మరి సంఘం నాయకులు కోడూరి సత్తన్న, కోడూరు చంద్రయ్య పాల్గొన్నారు.

బస్సులో పోగొట్టుకున్న డాక్యుమెంట్లు అప్పగింత

నవతెలంగాణ-నిర్మల్

బస్సులో పోగొట్టుకున్న డాక్యుమెంట్లు అప్పగించి కండక్టర్ ఏడీ నాథ్ నిజాయితీ చాటుకున్నారు. నిజామాబాద్ నుండి నిర్మల్ వస్తున్న నిర్మల్ డిపో బస్సులో శ్రీకృష్ణ ప్రయాణించాడు. ఈ క్రమంలో నిర్మల్‌లో ఇంటికి సంబంధించిన విలువైన డాక్యుమెంట్ కవర్ మరిచి వెళ్లిపోయాడు. కండక్టర్ ఇది గుర్తించి ఆన్‌డ్యూటీ కంట్రోలర్ కేఎం రెడ్డికి అందజేశాడు. సదరు ప్రయాణికుడు శ్రీకృష్ణను గుర్తించి బస్టాండ్‌కు పిలిపించి శనివారం డిపో మేనేజర్ ఎన్. సాయన్న డాక్యుమెంట్ కవర్ అందచేశారు. కండక్టర్ ఏడీ నాథ్‌ను అభినందించారు. కార్యక్రమంలో కంట్రోలర్లు శ్యామ్ సుందర్, కేఎం రెడ్డి పాల్గొన్నారు.



గిరిజనం గోడు పట్టేదెవరికీ..?

- ఐటీడీఏకు పీఓని నియమించని ప్రభుత్వం
- నిర్మల్ కలెక్టర్‌కు ఇన్‌ఛార్జీ బాధ్యతలు
- అపరిష్కృతంగా మిగిలిపోతున్న సమస్యలు
- పరిష్కారం కోసం ఆదివాసీ గిరిజనుల ఆరాటం

ఉమ్మడి జిల్లా ఆదివాసీ, గిరిజనుల సంక్షేమం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ)తోనే ముడిపడి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో అత్యధిక మండలాలు, ఆవాస ప్రాంతాలు ఐటీడీఏ పరిధిలోనే ఉన్నాయి. వీటి పరిధిలో నివసిస్తున్న జనాలకు ఏ చిన్న సమస్య వచ్చినా ఈ సంస్థనే పరిష్కరించాల్సి ఉంటుంది. ఇంతటి కీలకమైన ఐటీడీఏకు ప్రస్తుతం రెగ్యూలర్ ప్రాజెక్టు అధికారి(పీఓ) లేకపోవడం సమస్యగా మారుతోంది. ఇది వరకు ఇక్కడ పీఓగా పనిచేసిన వరుణ్‌రెడ్డిని ప్రభుత్వం మూడు నెలల కిందట నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా నియమించింది. అప్పటి నుంచి ఈయనకే ఐటీడీఏ ఇన్‌ఛార్జీ బాధ్యతలు అప్పగించింది. దీంతో కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన ఐటీడీఏ పరిధిలోని సమస్యలపై పూర్తిస్థాయిలో దృష్టిసారించలేని పరిస్థితి ఉందని తెలుస్తోంది. దీంతో సత్వరం పరిష్కారం చూపించే అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉండిపోతున్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యూలర్ పీఓ లేకపోవడంతో ఆయా శాఖల మధ్య సమన్వయం కూడా లోపిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం వెంటనే పూర్తిస్థాయి పీఓను నియమించాలని ఆదివాసీ గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి ఐటీడీఏ కీలకమైనది. వారికి సంబంధించి ఏ సమస్యనైనా.. ప్రయోజనమైనా ఈ సంస్థ ద్వారానే లభిస్తుంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈ సంస్థకు ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను పీఓలుగా నియమిస్తుంది. ప్రస్తుతం నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న వరుణ్‌రెడ్డి మూడు నెలల క్రితం వరకు ఇక్కడ పీఓగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆదివాసీ గిరిజనుల సమస్యలపై పట్టుసాధించే క్రమంలోనే ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్మల్‌కు కలెక్టర్‌గా బదిలీ చేసింది. ఇదే క్రమంలో ఐటీడీఏ ఇన్‌ఛార్జీ బాధ్యతలు కూడా అప్పగించింది. కానీ మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పూర్తిస్థాయి పీఓను నియమించలేదు. దీంతో ఐటీడీఏ పరిధిలో అనేక సమస్యలు అపరిష్కృతంగానే ఉండిపోతున్నాయని ఆదివాసీ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కావడంతో చాలా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తడం, భూ సంబంధిత సమస్యలు పెండింగ్‌లో ఉండటంతో పాటు అటవీ భూములకు విరాసత్ పట్టాలకు సంబంధించి సుమారు 3వేల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. తప్పులు పడిన పేర్లను సరిదిద్దేందుకు కూడా భారీగానే దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. వీటిని పీఓ స్వయంగా పరిశీలించి పరిష్కరించాల్సి ఉంటుంది.

సత్వర పరిష్కారం కరువు..?

ఐటీడీఏ పరిధిలో ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలకు సత్వర పరిష్కారం లభించడం లేదు. ప్రతి సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించే ప్రజాఫిర్యాదుల విభాగానికి కూడా అంతగా స్పందన రావడం లేదు. గ్రీవెన్స్‌లో పీఓ అందుబాటులో ఉన్న సమయంలో వివిధ ప్రాంతాల నుంచి ఆదివాసీ గిరిజనులు తండోపతండాలుగా తరలివచ్చి ఫిర్యాదులు అందజేసేవారు. వాటిని పరిశీలించి అనేక సమస్యలకు అక్కడికక్కడే పరిష్కరించే వెసులుబాటు ఉండేది. కానీ ప్రస్తుతం గ్రీవెన్స్‌లో పీఓ అందుబాటులో లేకపోవడం..కింది స్థాయి అధికారులు ఉండటం.. సమస్యకు పరిష్కారం లభిస్తుందనే భరోసా లేకపోవడంతో అనేక మంది గిరిజనులు ఫిర్యాదులు విభాగానికి రావడం లేదు. కేవలం పదుల సంఖ్యలో మాత్రమే జనాలు వినతులు అందజేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఐటీడీఏ పరిధిలోని ఆయా ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కూడా లోపిస్తోంది. వీటి పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కింది స్థాయి అధికారుల్లో జవాబుదారితనం లోపించడం మూలంగా అభివృద్ధి పనులకు అవరోధంగా మారుతోంది. గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల అమల్లోనూ వేగం మందగిస్తోందని ఆదివాసీ గిరిజనులు చెబుతున్నారు.





సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయి : పూసం సచిన్, టీఏజీఎస్ జిల్లా కార్యదర్శి



ఐటీడీఏకు పూర్తిస్థాయి పీఓ లేకపోవడంతో ఆదివాసీ గిరిజనుల సమస్యలు అపరిష్కృతంగా ఉంటున్నాయి. విద్యా, వైద్యం, సంక్షేమం వంటి కీలక రంగాలకు సంబంధించి సమీక్షలు ఉండటం లేదు. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి కుంటుపడుతోంది. ఆదివాసీ గిరిజనుల సమస్యలు పరిష్కరించే నాథులే కరువయ్యారు. ప్రభుత్వం వెంటనే పీఓను నియమించాలి.

సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించాలి : గోడం గణేష్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు



ఐటీడీఏకు పూర్తిస్థాయి పీఓ లేకపోవడంతో ఆదివాసీ గిరిజనుల సమస్యలు పరిష్కారం కావడం లేదు. అనేక సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఆదివాసీల సమస్యలు, చట్టాలు, హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కలిగిన సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రభుత్వం పీఓగా నియమించాలి. అప్పుడే సమస్యలకు పరిష్కారం లభించే ఆస్కారం ఉంటుంది.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ - భీమిని

పంచాయతీ కార్యదర్శుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని బిజెపి బెల్లంపల్లి నియోజకవర బాధ్యులు కొయ్యల ఏమాజి డిమాండ్ చేశారు. ఎంపిడిఓ కార్యాలయం ముందు రెండు రోజులుగా చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిమాండ్ల పరిష్కారం కావాలంటే ఉద్యమాన్ని ఉధృతం చేయాలన్నారు. ముఖ్యమంత్రి కేసిఆర్ అసెంబ్లీలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కరోనాతో చనిపోయిన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దశరథ్, మండల ఉపాధ్యక్షులు శంకర్, బిజేవైఎం మండల అధ్యక్షులు సాయికుమార్, ప్రధాన కార్యదర్శి సాయి, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేశవ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, సీనియర్ నాయకులు దూది ప్రకాష్, అజ్మీరా శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, గణపతి పాల్గొన్నారు.

కాసిపేట : మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు చేపడుతున్న సమ్మె రెండో రోజు కొనసాగింది. సమ్మెలో భాగంగా జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు సాపాటు శంకర్ సమ్మెకు సంఘీభావం తెలిపారు. సమ్మెకు మద్దతుగా సీనియర్ పంచాయతీ కార్యదర్శులు ఇతర గ్రామపంచాయతీల ఇన్‌చార్జి తీసుకోబోమని ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు.

బాధితుడికి ఆరోగ్య బీమా డబ్బులు అందజేత



నవతెలంగా - కౌటాల

తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఆప్టికలైజేషన్ ఇన్సూరెన్స్ స్కీం కింద 2022, జూలై 30న కన్నెపెల్లి గ్రామానికి చెందిన ఎల్క వెంకటేశ్వర్లు రూ.10,502 కట్టి ఎస్‌బీఐ జనరల్ ఆరోగ్య ఫ్లస్ స్కీంకు ఇన్సూరెన్స్ చేసుకున్నారు. ఈ పథకం వెంకటేశ్వర్‌తో పాటు అతని భార్య ఇద్దరికి వర్తిస్తుంది. ఇటీవల భార్యకు దగ్గు, దమ్ము ఎక్కువ కావడంతో ఆమెను మంచిర్యాల ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. ఖర్చులు రూ.51,002 చెల్లించారు. ఈ స్కీం వర్తించడంతో బాధితుడికి మంజూరైన రూ.51,002 శనివారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖ అధికారి నరసింహస్వామి అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఖాతాదారులందరు ఈ పథకం కింద ఆరోగ్య బీమా కోసం డబ్బులు కట్టుకున్నట్టయితే రూ.3లక్షల వరకు వైద్య ఖర్చులు లభిస్తాయని తెలిపారు. 18 ఏండ్ల నుండి 55 ఏండ్ల మధ్య వయసు ఉన్నవారు దీనికి అర్హులని తెలిపారు. అలాగే పిల్లలకు మూడు నెలల నుండి 18 ఏండ్లలోపు ఈ పథకం వర్తిస్తుందని, ఈ పథకంలో నలుగురికి ఎవరికి ఏమైన వైద్య ఖర్చుల కింద ఒక్కొక్కరికి రూ.3లక్షల వరకు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని తెలిపారు. ఖాతాదారులందరు ఈ పథకంలో చేరి వైద్య ఖర్చులు భారం కాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మేడే వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి



నవతెలంగాణ-నిర్మల్

మేడే వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ పేర్కొన్నారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. అంతర్జాతీయ కార్మిక వర్గం పోరాట స్ఫూర్తి దినం మేడేను జిల్లాలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. చికాగో అమరవీరుల స్ఫూర్తిని, కార్మికుల హక్కులను నీరుగార్చడానికి కార్మిక చట్టాలను సవరించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. 4 లేబర్ కోడ్‌ల ద్వారా బహుళజాతి సంస్థలకు లాభాలను చేకూర్చే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆనాటి మేడే స్ఫూర్తి ద్వారా పనిగంటల తగ్గింపు తో పాటు అనేక కార్మిక చట్టాలు వివిధ సందర్భాల్లో కార్మిక పోరాటాల ద్వారా రూపొందించబడ్డాయని గుర్తు చేశారు. ఈ మే డే మే 1 నుండి 7వ తేదీ వరకు వారోత్సవాల ద్వారా కార్మికుల్లో ప్రత్యామ్నాయ శ్రమ సంస్కృతిని పెంచే విధంగా కార్యక్రమాలు రూపొందించుకోవాలని తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు అతీక్, అరవింద్, సాయన్న, గాయత్రి, పోశెట్టి పాల్గొన్నారు.

సదరన్ క్యాంపులు వినియోగించుకోవాలి : ఎంపీపీ

నవతెలంగాణ - కౌటాల

జిల్లా కేంద్రంలో మే నెలలో నాలుగు విడతలుగా నిర్వహించే సదరన్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త వారికి 8న, కంటి చూపు సమస్య ఉన్న వారికి 16న, ఎముకల సమస్య ఉన్న వారికి 23న, మానసిక వైకల్యం ఉన్న వారికి 27న క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఆయా సమస్యలకు సంబంధించిన బాధితులు సదరన్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

నూతన ఐటి విధానంపై సమావేశాలు ఏమయ్యాయి?



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

కార్మికులకు నూతన ఐటి విధానంపై సమావేశాలు ఏమయ్యాయని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) డిప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజు గోపాల్ అన్నారు. శనివారం ఆర్‌కె ఓసిపి గనిపై ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాస్ అధ్యక్షతన కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగరాజ్ గోపాల్ మాట్లాడారు. సేఫ్టీ ఆరోగ్యం ముఖ్యమని, హెల్మెట్ గురించి సమావేశాలు పెట్టి అవగాహన కల్పిస్తున్నామని చెప్పే సింగరేణి యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆదాయపన్ను స్లాబులపై కేవలం నోటీసు బోర్డు వేసి ఎటువంటి అవగాహన కల్పించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కాలపరిమితి ముగిసినా గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలుగా కొనసాగుతున్న యూనియన్లు సైతం యాజమాన్యాన్ని ప్రశ్నించకపోవడం సరైంది కాదన్నారు. కార్మికులు ఏ పన్ను విధానం బాగుంటుందో తెలియక అయోమయానికి గురవుతున్నారని, ఇప్పటికైనా ఆదాయ పన్ను రిటర్న్ చేసేటప్పట్నుంచైనా సమావేశాలు నిర్వహించి అయోమయానికి తెర దించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విధి విధానాలతో బొగ్గు రంగంలో యూనియన్లను నిర్వీర్యం చేయాలని, వేతన ఒప్పందంలో యూనియన్ల ప్రాబల్యాన్ని తగ్గించే విధంగా వేజ్ బోర్డును పరిష్కరించకుండా ఆలస్యం చేస్తూ కార్మిక ప్రయోజనాలను దెబ్బతీస్తోందన్నారు. కార్మికులకు ఆదాయపన్ను భారం కాకుండా కోల్ ఇండియాలో అలవెన్లపై ఐటి మాఫీ చేసే విధంగా ఒప్పందాన్ని చేస్తే సింగరేణిలో 2011 నుండి ఇప్పటివరకు కార్మికుల ఓట్లతో గెలిచిన సంఘాలు అమలు చేయకుండా, సింగరేణి కార్మికులకు సంవత్సరంలో మూడు నెలల జీతం నష్టపోతున్నా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. అధికారులకు మాత్రం కోలిండియా ఒప్పందాన్ని అమలు చేస్తుంటే యాజమాన్యాన్ని ప్రశ్నించకుండా ఉన్న గెలిచిన సంఘాల తీరును కార్మికులు అర్థం చేసుకోవాలని కోరారు. భవిష్యత్తులో సిఐటియును కార్మికులు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ వెంకట్ స్వామి, అల్లి రాజేందర్, ఉపాధ్యక్షులు రామగిరి రామస్వామి, వడ్లకొండ ఐలయ్య ఆర్గనైజర్ భరత్ కార్మికులు పాల్గొన్నారు.

గుడిపేట్‌లోనే మెడికల్ కాలేజీ

మంజూరు చేసిన కేసీఆర్‌కు, హరీష్‌రావుకు కృతజ్ఞతలు : ఎంపీపీ

నవతెలంగాణ - హాజీపూర్

గుడిపేట్‌లోనే మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీపీ మందపల్లి స్వర్ణలత శ్రీనివాస్ తెలిపారు. శనివారం గుడిపేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటైన హాజీపూర్ మండలం వెనుబడి ఉండడం, ఎల్లంపల్లి ముంపు మండలం కావడంతో ఎమ్మెల్యే దివాకర్‌రావు చొరువతో ప్రభుత్వం గుడిపేట్‌లోనే మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కేసీఆర్, హరీష్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే కాకుండా ఎమ్మెల్యే మండలానికి ఇరిగేషన్ లిఫ్ట్‌తో పాటు కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సహకరించారని తెలిపారు. పునరావాస గ్రామాల్లో ఇంటి నిర్మాణం కోసం ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.70 కూడా నిర్వాసితుల ఖాతాల్లో జమవుతున్నాయని అన్నారు. టపాసులు కాల్చి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేష్, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మొగిలి శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు దొమ్మటి బాపు, చంద్రమౌళి, ఒడ్డే శ్రీనివాస్, బేర పోచయ్య, లగిశెట్టి రాజయ్య, దొమ్మటి లక్ష్మయ్య, ముడిమడుగుల శ్రీనివాస్, కందుల రమేష్ పాల్గొన్నారు.



ప్రశాంతంగా నవోదయ ప్రవేశపరీక్ష



నవతెలంగాణ-కాగజ్‌నగర్

2023-24 విద్యాసంవత్సరానికి గాను జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి గాను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. విద్యాలయంలో ఖాళీగా ఉన్న 80 సీట్లకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 5,920 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న విషయం తెల్సిందే. శనివారం నిర్వహించిన ప్రవేశపరీక్షకు 5,351 మంది విద్యార్థులు హాజరయ్యారు. 569 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 90.38 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు విద్యాలయం ప్రిన్సిపల్ బి చక్రపాణి తెలిపారు. కొత్త జిల్లాల వారీగా విద్యార్థుల హాజరు వివరాలిలా ఉన్నాయి.

జిల్లా	దరఖాస్తులు	హాజరు	గైర్హాజరు	శాతం
ఆదిలాబాద్	1,378	1,232	146	89.40
నిర్మల్	1,589	1,441	148	90.68
మంచిర్యాల్	1,526	1,379	147	90.36
కెబి-ఆసిఫాబాద్	1,427	1,299	128	86.77
మొత్తం	5,920	5,351	569	90.38

మేడే పోస్టర్లు విడుదల



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మే డే పోస్టర్లను శనివారం సీపీఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ నాయకులు విడుదల చేశారు. స్థానిక గాంధీచౌక్‌లో విడుదల చేసిన అనంతరం ఆ పార్టీ కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శి ఎండి చాంద్‌పాషా మాట్లాడుతూ చికాగో అమరవీరుల త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రపంచం నలుమూలలా కార్మికవర్గ హక్కులకు అనేక పోరాటాలు జరిగాయని అన్నారు. పోరాటాల ఫలితంగానే కార్మికులు అనేక హక్కులు సాధించుకున్నారని, కాని నేటి పాలకవర్గాలు చట్టబద్ధమైన ఆ హక్కుల అమలుకు పూనుకోవడం లేదని అన్నారు. చికాగో మృతవీరుల స్ఫూర్తితో బలమైన కార్మికోద్యమాలు చేపట్టడం ద్వారానే హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ రత్నం పోశన్న, నాయకులు గడ్డం రమేష్, ఐఎఫ్‌టీయు నాయకులు రాంజీ, దాగం మల్లయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ అధికారులకు, ఉద్యోగులకు, కార్మికులకు సన్మానం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో పనిచేస్తూ పదవి విరమణ పొందిన ఎస్‌ఓ టు జీఎం త్యాగరాజు, జూనియర్ అకౌంటెంట్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ సత్యనారాయణ, డిప్యూటీ సూపరింటెండెండ్ వైటేకర్, జనరల్ మజ్దూర్ జరీనాబీని సన్మానించారు. జనరల్ మేనేజర్ కార్యాలయంలో శనివారం జీఎం బి.సంజీవరెడ్డి, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. అలాగే ఆర్కే న్యూటెక్ గనిలో హాలర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ పదవి విరమణ పొందిన రాజయ్యను గని ఎస్‌ఓఎం స్వామి రాజు, ఆర్కే7 గనిలో జనరల్ మజ్దూర్ గా పనిచేసి పదవి విరమణ పొందిన మల్లయ్యను గని మేనేజర్ సాయిప్రసాద్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థకు వీరు చేసిన సేవలు మరువలేనివని, పదవి విరమణ పొందిన తర్వాత శేష జీవితం సంతోషంగా గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

కారోబార్లకు ఇన్‌చార్జి కార్యదర్శులుగా అవకాశం కల్పించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో ఉన్నందున గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కారోబార్లకు ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శులుగా అవకాశం కల్పించాలని శనివారం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గడ్డల వెంకటేశం ఆధ్వర్యంలో కారోబార్లు ఇన్చార్జి డిపిఓ సురేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్చార్జి పంచాయతీ కార్యదర్శులుగా కారోబార్లను నియమించి తమ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కారోబార్లు నాగేష్, సత్యనారాయణ, విట్టు, రమేష్ పాల్గొన్నారు.

ఉచిత కంటి శిబిరానికి స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనితల ఆధ్వర్యంలో శనివారం స్థానిక కిమ్స్ ఆసుపత్రిలో ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 17 మంది హాజరు కాగా అందులో ఏడుగురిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నామని, ప్రతీ శనివారం నిర్వహించే ఈ కంటి పరీక్షా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా డాక్టర్ కొత్తపల్లి అనిత సూచించారు. ఈ కార్యక్రమంలో ఆప్తామలజిస్టులు వసీ, గోపి పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్‌కు షాబీర్ పాషా రాజీనామా

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేసిన ఖానాపూర్ పట్టణవాసి షాబీర్ పాషా తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన రాజీనామా నిర్ణయాన్ని పార్టీ అధిష్టానానికి తెలిపినట్లు పేర్కొన్నారు. ఇంతకాలం తనకు సహకరించిన పార్టీ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
2
ఆదివారం 30 ఏప్రిల్ 2023

ఇక్బాల్‌పూర్ సర్పంచ్‌ను పదవీ నుంచి తొలగించాలి

నవతెలంగాణ- ఖానాపూర్

ఖానాపూర్ విలేకరిపై దాడి చేసిన ఇక్బాల్‌పూర్ సర్పంచ్‌ను పదవీ నుంచి వెంటనే తొలగించాలని ఖానాపూర్ విలేకరులు ఆందోళన చేపట్టారు. శనివారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ రాజమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. సర్పంచ్‌పై చర్యలు తీసుకొని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. విలేకరులపై దాడి చేస్తే సహించేదిలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలిక్ శ్రీనివాస్, మంత్రరాజ్యం దేవేందర్, లాందేరి రాజారాం, రాచమల్ల రాజశేఖర్, దాత్రిక లక్ష్మణ్, రాసమల్ల భాస్కర్, తుమ్మనపల్లి సాంకేతివర్ధన్, దినేష్ కైసర్, శంకర్, గంగాధర్ ఉన్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

పట్టణంలో అక్రమంగా వేసిన వెంచర్లు, సెల్లార్ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని శనివారం ఖానాపూర్ పట్టణ కౌన్సిలర్లు నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అలాగే మిషన్ భగీరథతో పట్టణ ప్రజల దాహార్తిని తీర్చలేకపోతున్నామని అన్నారు. ఈ వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం, కౌన్సిలర్లు కావలిసంతోష్, తొంటి శ్రీనివాస్, గుగ్లావత్ కిషోర్ నాయక్, బీఆర్ఎస్, నాయకులు పరిమి సురేష్, జన్నారపు శంకర్, కాంగ్రెస్ నాయకులు హమానుల్లాఖాన్, షబ్బీర్ పాషా, బీజేపీ నాయకుడు నాయిని సంతోష్ ఉన్నారు.

వీఓఏలని ప్రభుత్వమే ఆదుకోవాలి



నవతెలంగాణ-కడెం

వీఓఏలను ప్రభుత్వమే ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ పొద్దుటూరి సతీష్‌రెడ్డి అన్నారు. శనివారం వీఓఏల సమ్మెకు మద్దత్తు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏలు గ్రామంలో చిరువ్యాపారులని ప్రోత్సాహిస్తూ వారిని ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లడంలో వీఓఏలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. వీఓఏల తొమ్మిది ప్రధానమైన డిమాండ్‌లని ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు. లేనిచో వారిగా అండగా నిలిచి నిరసన ర్యాలీలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మండల అధ్యక్షులు బాబ్లు కడెం అధ్యక్షులు రహీం, యాదగిరి, అశోక్, రాంరెడ్డి, బ్రహ్మచారి, రాజన్న, సత్యం చారి, వీఓఏల మండల సంఘం అధ్యక్షురాలు రమా, కార్యదర్శి కవిత, కోశాధికారి రవి, సభ్యులు, గంగారాం, నర్సయ్య, నారాయణ, సుస్మిత పాల్గొన్నారు.

రేపు టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సామాజిక కవి సమ్మేళనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సామాజిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎ.స్వామి, వి.అశోక్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రముఖ అభ్యుదయ కవి, రచయిత డాక్టర్ ఉదారి నారాయణ అధ్యక్షతన సోమవారం సాయంత్రం 5 గంటలకు స్థానిక పెన్షనర్స్ భవనంలో నిర్వహించే ఈ కవి సమ్మేళనంలో "కార్మిక దృక్పథం, మహిళా స్వేచ్ఛ, మత సామరస్యం" అనే అంశాలపై కవిత్వాలు ఉంటాయని ఈ కవి సమ్మేళనానికి నిర్వాహకులుగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా సాంస్కృతిక కమిటీ కన్వీనర్ అంపెల్లి లక్ష్మీనారాయణ వ్యవహరిస్తారని తెలిపారు. జిల్లాలోని కవులు, రచయితలు, సాహిత్య అభిమానులు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మంత్రి అల్లోల



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ప్యారమూర్ గ్రామంలోని పలువురు బాధిత కుటుంబాలను శనివారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. గురువారం విద్యుద్ఘాతంతో మృతి చెందిన లోకేష్‌రెడ్డి(25) కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అదే గ్రామంలో ఇటీవల ప్రవీణ్ కిడ్నీ ఆపరేషన్ చేయించుకున్నా ప్రవీణ్‌ను, రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ సుదర్శన్‌లను వారి ఇంట్టికి వెళ్లి మంత్రి పరామర్శించి, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడొద్దని బరోసా కల్పించారు. మంత్రి వెంట మండల ఇన్‌చార్జీ అల్లోల మురళీధర్‌రెడ్డి, రైతుబంధు జిల్లా అధ్యక్షులు వెంకట్ రామ్‌రెడ్డి, మంత్రి పీఏ శ్రీనివాస్, ఎంపీపీ మహిపాల్ రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాధవ్‌రావు, సరంచ్‌ల సంఘం అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, డైరెక్టర్ సాయన్న, లింగారెడ్డి, మోహన్‌రెడ్డి ఉన్నారు.

భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్‌కు సన్మానం

నవతెలంగాణ-బాసర

మండల కేంద్రానికి మొదటి సారి వచ్చిన భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్‌బాబును శనివారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సుకం రామరావు, మార్కెట్ కమిటి డైరెక్టర్ సుధాకర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్ బాబును శాలువాతో సన్మానం చేశారు.

విగ్రహా ప్రతిష్టాపనకు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి ఆహ్వానం

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో వచ్చేనెల 10 నుండి 12 వరకు నిర్వహించే విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి శనివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దేవాదాయ శాఖ మంత్రి చేతుల మీదుగా వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన కరపత్రాలను విడుదల చేశారు. మే 12న దేవాదాయ శాఖ మంత్రి మండల కేంద్రానికి వస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆహ్వాన పత్రం అందించిన వారిలో ఆలయ కమిటీ సభ్యులు బాలాజీ జాదవ్, రాథోడ్ దత్తారాం, భిక్కు చౌహాన్, పవార్ భారత్, పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, ఉపసర్పంచ్ చౌహాన్ మహేందర్ ఉన్నారు.

అభివృద్ధి దిశగా కాలనీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ పట్టణంలోని అన్ని కాలనీలు అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయని మౌళిక సదుపాయాలు కల్పిస్తూ ప్రజల ఇబ్బందులు దూరం చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శనివారం పట్టణంలోని వార్డ్ నెంబర్ 23 మహాలక్ష్మి వాడలో వార్డు అభివృద్ధి కోసం రూ. 50 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను స్థానిక కౌన్సిలర్‌తో కలిసి పరిశీలించారు. పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జోగు రామన్న నేతృత్వంలో ప్రతి వార్డులో కోట్ల రూపాయలు మంజూరు చేసుకొని మౌలిక వసతులను కల్పిస్తూ అభివృద్ధిని సాధించగలుగుతున్నామన్నారు. ఆదిలాబాద్ పట్టణ సుందరీకరణతో పాటు బీటీ రోడ్లు, మొక్కల పెంపకం, డ్రైనేజీ పనులు పూర్తిచేసుకుని ఆహ్లాదకర వాతావరణం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ పందిరి భూమన్న, కొండ గణేష్, సంజయ్, భూమన్న, అశోక్ స్వామి పాల్గొన్నారు.

టీఏజీఎస్ మహాసభలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

వచ్చే నెల 5, 6 తేదీల్లో భద్రాచలం పట్టణంలో జరిగే తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం టీఏజీఎస్ రాష్ట్ర మూడో మహాసభలను జయప్రదం చేయాలనీ ఆ సంఘం మండల అధ్యక్షుడు పెందోర్ కృష్ణ అన్నారు. శనివారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన గోడ ప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఆదివాసుల హక్కుల రక్షణ, రాజ్యాంగ హక్కుల సాధనకు టీఏజీఎస్ పోరాడుతుందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడవుల ప్రయివేటీకరణ పేరుతో ఆదివాసులను అడవులనుండి దూరం చేసేందుకు కుట్ర చేస్తుందని అన్నారు. వివిధ రాష్ట్రాల్లో ఆదివాసీ హక్కులు కాలారస్తు ఆదివాసుల వారి హక్కులను అణిచివేస్తూ హక్కులకై పోరాడిన ఆదివాసులను దేశ ద్రోహులుగా జైళ్లలో వేస్తుందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామని, 4 ఏండ్ల నుండి చెబుతున్న ఇవ్వకుండా ఫారెస్ట్ అధికారులతో దాడులు చేయిస్తు వారిని భూముల నుండి వెళ్లగొడుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై చర్చించి వాటికీ వ్యతిరేకంగా ఈ మహాసభల్లో పోరాట రూపకల్పన చేయడం జరుగుతుందని అన్నారు. ఈ మహా సభలకు జాతీయ నాయకులు బృందా కరత్, మిడియం బాబురావు వివిధ రాష్ట్రాల, జిల్లాల ప్రతినిధులు హాజరైవుతారని అన్నారు. ఈ మహాసభలకు ఆదివాసులు అధిక సంఖ్యలో హాజరై, జయప్రదం చేయాలని కోరారు. ఆదివాసీ నాయకులు యువరాజ్, మాన్కు, భోజ్జు, నాగోరావు పాల్గొన్నారు.

ధరలు పెంచి పేదలపై భారం మోపుతున్న కేంద్రం

- ఎమ్మెల్యే జోగు రామన్న
- బీఆర్ఎస్‌లో మహిళల చేరిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళల పట్ల వ్యవహరిస్తున్న తీరుని నిరసిస్తూ, బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కేఆర్కే కాలనీ, దుర్గానగర్ చెందిన 300 మంది మహిళలకు ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు నిత్యావసర సరుకుల సరుకులపై విపరీతమైన ధరలు పెంచి పేద కుటుంబాలకు ఆర్థిక సంక్షోభాన్ని సృష్టిస్తున్న కేంద్రానికి మహిళల నుండి నిరసనసెగా ఈ విధంగా ఎదురవుతుందని అన్నారు. ప్రజలు నిత్యం వాడే వస్తువులపై కేంద్ర ప్రభుత్వం టాక్స్‌లతో పాటు విపరీతమైన ధరలను పెంచి పేద మధ్యతరగతి కుటుంబాలపై భారం మోపుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పేదల పార్టీయని, బీజేపీ పార్టీ సంపన్న వర్గాల పార్టీయని అన్నారు. కేంద్ర



ప్రభుత్వం, మన రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఉన్న తేడాలను గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జహిర్ రంజాని, పట్టణ అధ్యక్షులు అజయ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, నాయకులు రామ్‌కుమార్, శివకుమార్, శైలేందర్ వాగ్మారే, మైనార్టీ నాయకులు సలీం, స్వరూప రాణీ, బుడగ మమత పాల్గొన్నారు.

పిల్లలకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలి

- రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి



నవతెలంగాణ-ఉట్నూర్

అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలు, బాలింతలకు, కిషోర బాలికలకు, గర్భవతులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర మహిళ కమీషన్ సభ్యురాలు కుంర ఈశ్వరిబాయి అన్నారు. శనివారం మండలంలోని శ్యాంపూర్ సెక్టార్ పరిధిలోని గోదరిగూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్ర నెల సమీక్షలో ఈశ్వరిబాయి పాల్గొన్నారు. సమీక్షలో పలు అంశాలపై చర్చించారు. అంగన్‌వాడీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం విధి విధాలను అడిగి తెలుసుకోవడంతో పాటుగా స్టాక్ రిజిష్టరు, పిల్లలకు అందిస్తున్న సేవలపై వివరాలు సేకరించారు. పప్పులు, నూనె, బాలమృతం గత రెండు నెలల నుంచి సరఫరా కావడం లేదని ఈశ్వరిబాయి దృష్టికి అంగన్‌వాడీలు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పక్క భవనాల నిర్మాణాలను ఏర్పాటుకు తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. కేంద్రానికి వచ్చే వారిని కుటుంబ సభ్యులతో సమానంగా చూసుకోవాలని అందరికి సక్రమంగా పౌష్టికాహారం అందిస్తే, రక్తహీనతకు గురి కాకుండ ఉంటారని అన్నారు. అనంతరం ఈశ్వరి బాయిని అంగన్‌వాడి సిబ్బంది శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజార్ లింగమ్మ, టీచర్లు సంగీత, పూజ, సుమిత్ర, హీరాబాయి ఉన్నారు.

రేషన్ షాపుల్లో 12 రకాల సరుకులు అందజేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్

పేద మధ్యతరగతి కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 12 రకాల నిత్యావసర సరుకులు ఉచితంగా అందజేయాలని ప్రగతిశీల మహిళా సంఘం పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు నంది సమత, జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల లక్ష్మీలు అన్నారు. శనివారం ప్రగతిశీల మహిళా సంఘం పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో ఖానాపూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకులు ధరల మీద ధరలు పెంచుతూ పక్షం రోజులకు ఒకసారి డీజిల్, పెట్రోల్ ధరలు పెంచుతున్నారని అన్నారు. మోడీ పాలనకు ముందు రూ.450 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర రూ.1200కు పెంచి సబ్సిడీ ఎత్తివేసిందని అన్నారు. ప్రజలకు ఆహార భద్రత కల్పించే ప్రణాళికలు లేవని పైగా ప్రజా పంపిణీ వ్యవస్థను నీరుగార్చే వైపుగా పాలకుల విధానాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో ఇప్పటివరకు అర్హులైన లక్షలాది మంది లబ్దిదారులు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న ఇంతవరకు కార్డులు ఇవ్వలేదని అన్నారు. పైగా గతంలో రేషన్ ద్వారా గోధుమలు, పంచదార, పప్పు, నూనె తదితర సరుకులు ఇచ్చేవారని వాటిని ఇప్పుడు పూర్తిగా బంద్ చేసి పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. ఎఫ్‌సీఐ గోదాముల్లో ముక్కిన



పురుగు పట్టిన బియ్యం ప్రజలకు పంపిణీ చేస్తున్నారని అన్నారు. నాణ్యమైన సన్న బియ్యం ఉచితంగా అందించాలని కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్‌లు సగం సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ లక్ష్మీ, కవితా, పద్మా, జ్యోతి, సుమలత పాల్గొన్నారు.

మాయమాటలు చెప్పి పంటపొలాలు తక్కువ ధరకు



నవతెలంగాణ-జైనథ్

చనాక బ్యారేజ్ కోసం లక్షల విలువలు చేసే భూములను మాయమాటలు చెప్పి తక్కువ ధరకే బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకుందని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ అన్నారు. మండలంలోని కోరట గ్రామంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ ఆధ్వర్యంలో యువకులు మహిళలు పలువురు బీజేపీలోకి చేరారు. ఈ సందర్భంగా పాయల శంకర్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న సీఎం కేసీఆర్‌కు ప్రజలను మోసం చేయడం అలవాటైందని అన్నారు. లక్షల విలువ చేసే భూములను మాయ మాటలు చెప్పి తక్కువ ధరకు తీసుకున్నారని అన్నారు. భూమికి బదులు సారవంతమైన భూమి ఇస్తామని అన్నారు. ఇల్లు లేని పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇస్తామని అన్నారు. ఇవన్నీ చేయకపోతే ఓట్లు అడగటానికి మీ ఊరికి రాను అని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. కానీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను మరిచిపోయి తనకు తన కుటుంబానికి కోట్ల రూపాయలు కూడబెట్టుకుంటున్నారని అన్నారు. గుడిసెలకు బదులు డబుల్ బెడ్ రూమ్‌లు వస్తాయన్న ఆశతో పేదలు తమ స్థలాలను గుడిసెలను కూడా వారికి అప్పచెప్పారని అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఎండకు వానకు చలికి తట్టుకుంటూ పారీలు కప్పిన పందిళ్లలో జీవనాన్ని వెల్లదీస్తున్నారని అన్నారు. వెంటనే పేదలకు పక్కా ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే జోగు రామన్న తమ భూములకు రూ.15 నుంచి రూ.40 లక్షల వరకు ప్రభుత్వం నుండి వసూలు చేసుకుంటున్నారని అన్నారు. కానీ పేదల భూములకు నియమాల సాగు చెప్పి ఐదు లక్షల కూడా ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాందాస్, కౌటా సర్పంచ్ విజయ్, రమేష్, అనిల్, రాజు, రఘుపతి, విజయ్, ఆకంత్ రమేష్, రత్నాకర్‌రెడ్డి, మయూర్ చంద్ర, గంగారెడ్డి, రత్నాకర్‌రెడ్డి, చిలుకూరి జ్యోతిరెడ్డి సునందరెడ్డి, సంతోష్, రమేష్ రాష్ట్రపాల్, వెంకన్న, ముకుంద్ పాల్గొన్నారు.

నేటి ప్రధాని మాన్ కి బాత్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బాసర

దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం 100వ ఎపిసోడ్ మాన్ కి బాత్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు శనివారం బీజేపీ నాయకులు వైష్ణవి లాడ్జ్‌లో సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేసి ప్రజలు దేశ ప్రధాని మాన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించేలా ఏర్పాటు చేయనున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. సమావేశంలో రవి పాండే, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయినాథ్ పటేల్, నర్సింగ్ రావు, బి.రమేష్, సాయినాథ్, మండల అధ్యక్షుడు లక్ష్మరెడ్డి, నర్సింగ్ రావు, సుద్ద సాయిబాబ, శంకర్ పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత తొమ్మిదేండ్ల కాలంలో బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజానికానికి చేసిందేమీ లేదని, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీజేపీకి ఓట్లు వేయాల్సిన అవసరం ఏంటని ఎమ్మెల్యే జోగు రామన్న ప్రశ్నించారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వంద మంది లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అంతకుముందు ఇటీవల ఆదిత్య నగర్ హనుమాన్ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే తన ఒక నెల వేతనం రూ.2లక్షల 50వేలను అందించడంతో కమిటి సభ్యులు ఆయనను శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, వైస్ చైర్మన్ జహీర్ రంజాని, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, అశోక్ స్వామి, డాక్టర్ లక్ష్మణ్ నాయకులు సాజిదోద్దీన్, రామ్‌కుమార్, దర్మపాల్‌లతో పాటు ఆయ వార్డుల నాయకులు పాల్గొన్నారు.

రేపు స్టేడియంలో స్విమ్మింగ్ పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మే 1న స్విమ్మింగ్ పోటీలను ఓక్లే ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో పోటీల నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలను ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్‌లో మే 1న సాయంత్రం 5 గంటలకు చేపట్టనున్నట్టు తెలిపారు. 5 నుంచి 14 సంవత్సరాలలోపు వయస్సు గల వారికి విత్ ట్యూబ్, 5 నుండి 17 సంవత్సరాలలోపు వారు విత్ ఔట్ ట్యూబ్ పోటీలు ఉంటయాని తెలిపారు. ఆసక్తిగలవారు 9347298294, 9055535553, 9963728361 నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

ఘనంగా ఆదివాసీ ఆహార వేడుకలు



నవతెలంగాణ-ఉట్నూర్

ఇక్రిశాట్ ఆధ్వర్యంలో సహకార మిత్ర సంస్థ సహకారంతో శనివారం స్థానిక కేబి కాంప్లెక్స్ హెచ్ కెజీఎస్ పంక్షన్ హాల్‌లో ఆదివాసీ ఆహారం వేడుకలు నిర్వహించారు. ఆదివాసీ ఆహారంలో భాగంగా ఆదివాసీ ప్రజలు జొన్నలతో తయారు చేసిన వంటలను ప్రదర్శించారు. జొన్నరొట్టే, గట్కా, లడ్డులు, ఉక్కా, వివిధ రకాల వంటలు ప్రదర్శించడంతో ఇక్రిశాట్ ప్రతినిధులు, ఆదివాసీ ప్రజలు, సాగు రైతులు, ఆదివాసీ ప్రజలు వీక్షించారు. అంతకుముందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇక్రిశాట్ ప్రతినిధులు విన్సన్, మారిన్, సహకార మిత్ర సంస్థ ప్రతి నిధులు కుంర విఠల్‌రావ్ మాట్లాడుతూ ఆదివాసుల సంప్రదాయ, పూరాతన పద్దతుల్లో పండించే పంటలను ప్రోత్సహించేందుకు గత మూడు సంవత్సరాల నుంచి కృషి చేస్తున్నామని అన్నారు. ఏజెన్సీలోని కొన్ని ఆదివాసీ గ్రామాల్లోని రైతులను ఎంపిక చేసి వారికి ఉచితంగా జొన్నలను అందించి విత్తనం నాటిన నుంచి పంట ఇంటికి వచ్చేంత వరకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నామని అన్నారు. నేటి కల్తీ యూగంలో ఆదివాసీ సంప్రదాయ పంటలు కల్తీ కాకుండ సంప్రదాయ పద్దతిలో పంటలు సాగు చేయడంతో పాటుగా సారవంతమైన నెల, అరోగ్యానికి మంచిదని అన్నారు. ముందు ముందు మరింత మంది రైతులను ఎంపిక చేసి సంప్రదాయ పంటలను ప్రోత్సహించేందుకు తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం పలు సంస్కృతిక, సంప్రదాయ ఆదివాసీ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో సహకార మిత్ర సంస్థ అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

ఐకేపీ కార్యాలయానికి తాళం వేసి అధికారులను నిర్బంధించిన వీఓఏలు

నవతెలంగాణ-ఉట్నూర్

ఐకేపీలో బుక్ కిపర్‌గా విధులు నిర్వహించే వీఓఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌తో శనివారం ఐకేపీ కార్యాలయానికి తాళాలు వేసి అధికారులను నిర్బందించారు. సమస్యలను పరిష్కరించేందుకుపై అధికారులతో చర్చించాలని డిమాండ్ చేశారు. అనంతరం వీఏఓలు చేస్తున్న దీక్ష శిభిరానికి ఎస్సీ, ఎస్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జాదవ్ రామ్‌కిషన్ నాయక్, ప్రజా సంఘాల జేఏసీ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బానోత్ రామారావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకేపీ ఎర్పాటు అయినప్పటి నుంచి బుక్ కీపర్‌గా విధులు నిర్వహిస్తున్న వీఓఏల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డురంగా ఉందన్నారు. వీఓఏలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వీఓఏలు కమల, రాజమణి, సరోజ, రాజు, రమేష్ ఉన్నారు.

రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకులు అందించాలి



నవతెలంగాణ- లక్ష్మణచాంద

పేద మద్యతరగతి కుటుంబాలకు రేషన్‌దుకాణాల్లో నిత్యావసర సరకులు ఉచితంగా అందజేయాలని శనివారం ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో డిప్యూటీ తహసిల్దార్ గంగాధర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల లక్ష్మీ మాట్లాడుతూ పాలకులు ధరలు పెంచుతూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు.పక్షం రోజులకు ఒకసారి డీజిల్, పెట్రోల్ ధరలు,ఉప్పు పప్పు దగ్గర నుండి ప్రతి వస్తువు ధరలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ పాలనకు ముందు రూ.450 రూపాయలు ఉన్న గ్యాస్ సిలిండర్ ధర రూ.1200 రూపాయలకు పెంచి సబ్సిడీ ఎత్తివేసిందని ఆరోపించారు.మోడీ ప్రభుత్వం అంబానీలకేమో రూ.లక్షల కోట్లు దోచిపెడుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మీ కవిత, పద్మ జ్యోతి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారుల చేతిలో మోసపోవద్దు



జన్నారం : రైతులు దళారుల చేతుల్లో పడి మోసపోవద్దని ఐకెపి ఎపిఎం బుచ్చన్న అన్నారు. శనివారం మండలంలోని కవ్వాల్, కిష్టాపూర్, మోర్రిగూడ, దేవునిగూడ గ్రామాల సర్పంచులతో కలిసి వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల తాము పండించిన పంటలను డీఆర్డీఏ ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు గుర్రం శిరీష గోపాల్, బక్యా రాజగోపాల్, కోలా తార పద్మారావు, జయశ్రీ సంతోష్, ఎంపీటీసీలు సౌజన్య ,మచ్చ పోసవ్వ, మాధురి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గోట్ల రాజేష్ యాదవ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బీజేపీకి రాజీనామా

నవతెలంగాణ - బెజ్జూర్

ఆదివాసీ రాష్ట్ర నాయకులు సోయం చిన్నయ్య, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు తలండి భిక్షపతి, బూత్ కమిటీ అధ్యక్షుడు నందరాం, పొర్శెటి రత్నయ్య, సలుగుపెల్లి ఉప సర్పంచ్ గెడం నగేష్, ఆంత్రం రంజిత్ బీజేపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి లక్ష్యాలను కలిగిన బహుజన సమాజ్ పార్టీలోకి ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీన్‌కుమార్ సమక్షంలో చేరుతున్నట్టు తెలిపారు.



పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ రామారావు

నవతెలంగాణ - కాసిపేట



ప్రతి గ్రామానికి పోస్టాఫీస్ సేవలు అందుబాటులోకి వస్తున్నాయని, పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ రామారావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని రొట్టెపల్లి పంచాయతీలోని తిరుమలాపూర్‌లో నూతన పోస్టాఫీస్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక అన్ని గ్రామాల్లో పోస్టల్ సేవలు అందిస్తామన్నారు. పథకాలను, పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పెంద్రం హన్మంతు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ - బెజ్జూర్

మండలంలోని కుకుడా గ్రామానికి చెందిన పెద్దల సతీష్-యశ్వంత్ అన్నదమ్ముల బాధిత కుటుంబాన్ని శనివారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ద్విచక్ర వాహనం అదుపు తప్పి సతీష్ మృతి చెందగా యశ్వంత్‌కు తీవ్ర గాయాలు అయిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబ సభ్యులను మండల కోఆప్షన్ సభ్యుడు బషరత్‌ఖాన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సిడాం సకారాం, వైస్ ఎంపీపీ సాద్మేక జ్యోతి పురుషోత్తం, కుకుడా సర్పంచ్ ఆసియాబాను రహిమత్, అంబగట్టు సర్పంచ్ తలండి తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు ఇంజిరి రాజారామ్, ఆజీమ్ ఖాన్, నారాయణ, గౌత్రె శంకర్, జంగిటి మల్లేష్, దూపం శ్రీను, మంజూర్ పరామర్శించారు.

రికవరీ చేసిన మొబైల్ ఫోన్ అప్పగించిన ఎస్ఐ



నవతెలంగాణ - చింతలమానేపల్లి

మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న దిందా గ్రామానికి చెందిన డగే ఆకాష్‌కు తిరిగి ఎస్ఐ గుంపుల విజయ్ అందజేశారు. ఈ నెల 8న మంచిర్యాల రైల్వేస్టేషన్లో సెల్‌ఫోన్ పడిపోగా మండల పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ చేపట్టిన ఎస్ఐ శుక్రవారం ఫోన్‌ను ఆకాష్‌కు అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఫోన్ ఐఎంఇఐ నంబర్ ఆధారంగా ట్రాప్ చేసి రికవరీ చేసినట్లు తెలిపారు. ప్రజలు తమ వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎవరైన సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సీఈఐఆర్.గౌ.ఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి పూర్తి వివరాలు పొందవచ్చని, అలా చేసినట్లయితే త్వరగా ఫోన్‌ను పట్టుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు.

రెవెన్యూ ఎంప్లాయిూస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



నవతెలంగాణ -వేమనపల్లి

మండల కేంద్రంలోని రైతువేదికలో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిూస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా), ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 34 మంది దాతలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సంతోష్, ఎంపిడిఓ లక్ష్మయ్య, నీల్వాయి ఎస్ఐ సుబ్బారావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌పోస్టును సందర్శించిన ఓఎస్‌డీఓ

వాంకిడి : మండల కేంద్రంలో గల చెక్‌పోస్టును శనివారం ఓఎస్‌డీఓ సుదర్శన్‌రెడ్డి సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. చెక్‌పోస్టు నుండి అక్రమంగా రవాణా చేసే వాహనాలకు సంబంధించిన రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. ఆయనతో పాటు టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ లస్మయ్య, డిప్యూటీ తహసీల్దార్ గొమాసె రాజ్‌కుమార్, దుర్గం స్రావన్‌కుమార్, గిరిదవార్ అబ్దుల్‌మాజిద్ ఉన్నారు.

లొద్దిగూడలో సివిల్ రైట్స్ డే

వాంకిడి : మండలంలోని లొద్దిగూడ గ్రామంలో శనివారం సివిల్ రైట్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మోయినొద్దీన్ మాట్లాడుతూ ప్రజలకు సివిల్ రైట్స్ డేపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఆయనతో పాటు ఎస్ఐ సాగర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆకులు తింటూ వీఓఏల నిరసన

నవతెలంగాణ-కాగజ్‌నగర్



తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీఓఏలు చేస్తున్న సమ్మె 12 రోజులకు చేరుకుంది. అయినా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ శనివారం వీఓఏలు ఆకులు తింటూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ గత 12 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు. రాష్ట్రంలో మంత్రులకు, ఎమ్మెల్యేలకు జీతాలు పెంచిన ప్రభుత్వం, వీఓఏలకు జీతాలు ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, వీఓఏలు వనిత, అంకయ్య, సమీరా, ప్రమీల, లత, మోహన్, పురుషోత్తం, రాంచందర్, సౌందర్య పాల్గొన్నారు.

వాంకిడి : ఐకేపీ కార్యాలయం ముందు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఓఏలు చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. శనివారం సమ్మెలో భాగంగా వంటావార్పుతో నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వీఓఏలు పాల్గొన్నారు.



భీమిని

భీమిని : వీఓఏల శ్రమ దోపిడీ చేస్తున్న కేసీఆర్‌ను గద్దె దించితేనే సమస్యలు పరిష్కారమవుతాయని బిజెపి బెల్లంపల్లి అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి, నియోజకవర్గ బాధ్యులు కొయ్యల ఏమాజి అన్నారు. శనివారం విఓఏల సమ్మె శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. విఓఏలు చాలీచాలని జీతాలతో దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని తెలిపారు. ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేల జీతాలు లక్షల్లో పెంచుకున్నారు కానీ వీరిని పట్టించుకోవడం లేదన్నారు. కేసీఆర్ ఆయన కుటుంబ ఆస్తులను పెంచుకోవడానికి తప్ప ఉద్యోగుల బాధలు చూసే తీరిక లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దశరథ్, ఉపాధ్యక్షులు శంకర్, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేశవ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, సీనియర్ నాయకులు దూది ప్రకాష్, అజ్మీరా శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, దోని సాయికుమార్, సాయి, గణపతి, రవి పాల్గొన్నారు.

ఆదివాసులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆదివాసుల అభ్యున్నతి పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని, దీనికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఆదివాసీ భారత మహాసభ కేంద్ర కమిటీ సభ్యులు మేస్రం బండు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసి భవనంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూరి రాజేష్ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఆదివాసి జీవితాల్లో వెలుగు నిండ లేదన్నారు. ఆదివాసీల అభివృద్ధి పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసగిస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఫాసిస్టు బిజెపి ప్రభుత్వం ఆదివాసీ హక్కులను కాలరాసేలా అటవీ చట్టాలు తీసుకువస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వాటికి వ్యతిరేకంగా పోరాటం చేయకుంటే భవిష్యత్తులో ఆదివాసీలకు మనుగడ ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మౌలిక వసతులైన విద్య, వైద్యం, రవాణా లాంటివి నేటికీ ఆదివాసీలకు అందని ద్రాక్షల మిగిలిపోయాయని అన్నారు. జీవో నెంబర్ 3 రద్దు చేయడం ఆదివాసీలకు ఉద్యోగ అవకాశాలు లేకుండా చేయడమే అన్నారు. 1/70, పెసా చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో రైతులు దళారీ వ్యవస్థతో మోసపోతున్నారని పేర్కొన్నారు. నకిలీ ఎరువులు విత్తనాల పట్ల ఆదివాసులకు అవగాహన లేకపోవడంతో పంట పండక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ మోసాలను గమనించి వాటికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబిఎం రాష్ట్ర కో ఆర్డినేటర్ సైదయ్య, జిల్లా కార్యదర్శి తిరుపతి, ప్రియాంక, నగేష్, పురుషోత్తం, వివిధ మండలాల ఆదివాసీలు పాల్గొన్నారు.

లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఇల్లందు, ఎస్టిపిపి లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. దీనికి ముఖ్య అతిథులుగా డైరెక్టర్ (ఈ అండ్ ఎం) సత్యనారాయణ సతీమణి హరిణి, డైరెక్టర్ (ఆపరేషన్స్) శ్రీనివాస్ సతీమణి కళ్యాణి, డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వరరెడ్డి సతీమణి సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా హరిణి సత్యనారాయణ మాట్లాడుతూ లేడీస్ క్లబ్ సభ్యులందరూ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. ప్రతినెల వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేసుకొని ఆహ్లాదంగా ఉండడం సంతోషమని తెలిపారు. రాధా కుమారి మాట్లాడుతూ మహిళలందరూ పాల్గొని విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మహిళలు చేసిన నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించింది. త్యాగరాజు పదవి విరమణ సందర్భంగా సతీమణి శ్యామలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్వరూప దేవేందర్, స్వరాజ్యం సూర్యనారాయణ రాజు, యశోద మోహన్‌రెడ్డి, బెల్లంపల్లి రీజియన్, ఎస్టిపిపి లేడీస్ క్లబ్ సెక్రటరీలు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.



సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కెరమెరి



ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపీపీ పెందూర్ మోతీరాం అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు తమ నివేదికలు చదివి విన్పించారు. ముందుగా వ్యవసాయ శాఖ అధికారి గోపికాంత్ మాట్లాడుతూ మండలంలోని రైతులందరికీ రైతుబంధు అందించామన్నారు. అర్హులైన రైతు మృతి చెందిన కుటుంబాలకు రైతు బీమా అందించామని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం ద్వారా మారుమూల గ్రామాలకు తాగు నీరు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏటిడబ్ల్యూ పురుషోత్తం మాట్లాడుతూ మండలంలోని పలు ఆశ్రమ పాఠశాలల్లో ఆంగ్ల మధ్యమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు సాధించడంలో పురోగతి సాధించామన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టామన్నారు. హట్టి ఆశ్రమ పాఠశాల విద్యార్థికి అవార్డు లభించిందని తెలిపారు. ఏటూరునాగారం, కిన్నెరసానిలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో ఆశ్రమ విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించారన్నారు. ప్రత్యేకాధికారి ఆడే ప్రకాష్ మాట్లాడుతూ మండలంలో 19మోడల్ పాఠశాలలు మంజూరు కాగా ఇప్పటికే ఖైరి, ధనోర పాఠశాలలు పూర్తి చేసి ప్రారంభించామన్నారు. సరిహద్దు గ్రామాల్లో కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు రెండు రాష్ట్రాల్లో కొనసాగుతున్నారని తెలిపారు. దీంతో విద్యార్థులు పాఠశాలలకు హాజరుకాని పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. దీంతో ఎంపీపీ మోతీరాం, వైస్ ఎంపీపీ సయ్యద్ అబ్దుల్ కలాం కల్పించుకొని గౌరీ పాఠశాలకు సంబంధిత టీచర్ ఈ ఏడాది సక్రమంగా హాజరు కావడం లేదని, 15 రోజులకోసారి విధులకు హాజరైనట్లు తెలుపగా, విధులకు హాజరుకాని ఉపాధ్యాయుల వేతనాలు నిలిపేశామని వివరణ ఇచ్చారు. వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ సోనియా మాట్లాడుతూ పశు గ్రాసం అందుబాటులో ఉందని, కావాల్సిన రైతులు సబ్సిడీపై పొందవచ్చన్నారు. డిప్యూటీ రేంజర్ నాగేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలం జూన్, జులై మాసాల్లో హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు అవసరమున్న మొక్కలను తమ శాఖ ద్వారా అందిస్తామని తెలిపారు. అడవులను నరికి వేయకుండా ఉన్న భూమినే సాగు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ రమేష్ మాట్లాడుతూ ఝరి, గోయగాం గ్రామాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సెడ్మకి ద్రుపతబాయి, ఎంపీడీఓ సత్యనారాయణగౌడ్, ఎంపిఓ సుదర్శన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మతిన్, సర్పంచులు కుంరం నాణేశ్వర్, బయనాబాయి, గుణవంత్‌రావ్, వివిధ శాఖల అధికారులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



నవతెలంగాణ - జైనూర్

ప్రజలకు స్వచ్ఛమైన సహజ వాయువు అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న పల్లె ప్రకృతి వనాల్లో మొక్కల సంరక్షణకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. శనివారం మండలంలోని కాసిపేట, మర్కగూడ, బాబుల్‌గూడ, మామడ గ్రామాల్లో పల్లెప్రకృతి వనాలు, గ్రామ పంచాయతీ నర్సరీలు, మిషన్ భగీరథ, వెల్నెస్ సెంటర్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లె ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలకు సకాలంలో నీటిని అందించి సంరక్షించాలని, ఎండిపోయిన వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలని తెలిపారు. గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న నర్సరీల్లో తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలను సిద్ధం చేయాలని తెలిపారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా జిల్లాలోని ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ అందించి శుద్ధ జలం సరఫరా చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు అన్ని మౌళిక సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం చేపట్టిన మన ఊరు మన బడి కార్యక్రమం మొదటి విడతలో భాగంగా ఎంపికైన పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి వచ్చే విద్యా సంవత్సరం లోగా సిద్ధం చేయాలని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రైతులు న్యాయ సలహాలు తీసుకోవాలి



నవతెలంగాణ - సిర్పూర్(టి)

రైతులు తమకు ఎలాంటి సమస్యలున్నా తెలుసుకోవడానికి సలహా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి రైతు సేవా కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి పి.రవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండల న్యాయ అధికార సంస్థ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం దృష్టిలో అందరు సమానమేనని, వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారికి న్యాయమైన చట్టాలున్నాయని తెలిపారు. రబీ, ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తుకునే విత్తనాల నుండి వాటి పెరుగుదలకు ఉపయోగించే ఎరువులను అనేక గుర్తింపు లేని సంస్థలు ఏర్పడి రైతులకు అమ్మి లాభాలు గడిస్తున్నాయని, వీటిని అరికట్టడానికి ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గుర్తింపు పొందిన సంస్థ నుండి ఫర్టిలైజర్ దుకాణాల్లో మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకోవాలన్నారు. దళారులను నమ్మి మోసపోకూడదన్నారు. పంట నష్టం బీమాను కూడా ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని, వారి వివరాలను వ్యవసాయ అధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. న్యాయ సలహా అధికార కేంద్రంలో పారా లీగల్ వాలంటీర్‌ను నియమిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గణపతి, న్యాయవాదులు కళ్యాణ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు, కాగజ్‌నగర్ ఏడీఏ జె మనోహర్, మండల ఉపాధ్యక్షుడు ఈర్ల సత్యనారాయణ, ఎంపీటీసీ సోయల్ హైమద్, ఏడు మండలాలకు సంబంధించిన మండల వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈఓలు, రైతులు, ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్‌కుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని ఎస్పీ సురేష్‌కుమార్ తెలిపారు. గత సంవత్సరం మే నెలలో జిల్లాకు బదిలీపై వచ్చి ప్రస్తుతం కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో అదనపు డిసిపిగా బదిలీపై వెళ్తున్న జిల్లా అదనపు ఎస్పీ(ఎఆర్) భీంరావుని హెడ్ క్వార్టర్స్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖలో భీంరావు చేసిన కృషి అభినందనీయమన్నారు. జిల్లాలో ఫైరింగ్ రేంజ్ ఏర్పాటు, స్పోర్ట్స్ మీట్, పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన పలు కార్యక్రమాలు విజయవంతం చేయడంలో ఆయన కృషి మరువలేనిదని తెలిపారు. క్రమశిక్షణ, నిబద్ధత, సమయ పాలన పోలీస్ శాఖలో చాలా ముఖ్యమని, ఈ విషయాల్లో చాలా ముందుండేవారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) అచ్చేశ్వరరావు, ఆసిఫాబాద్ డీఎస్పీ శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ సిఐ సుధాకర్, డిసిఆర్‌బి సిఐ పవన్ కుమార్, సిఐలు రాణా ప్రతాప్, బుద్ధస్వామి, శ్రీనివాస్, నరేందర్, సాదిక్ పాషా, ఆర్ఐ (అడ్మిన్) భరత్ భూషణ్, ఆర్ఐ (ఎంటి) శ్రీనివాస్, ఆర్ఐ (హోంగార్డ్స్) కిరణ్, డిపిఓఎఓ భక్తప్రహ్లాద్, జిల్లా పోలీస్ యూనియన్ అధ్యక్షుడు విజయశంకర్‌రెడ్డి, ఆర్ఎస్ఐలు ఓదెలు, రాజశేఖర్, కిరణ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ- కడెం

మే నెల 1 నుండి 31 వరకు నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సమ్మర్ క్యాంపు మండల ఇంచార్జ్ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. కడెం మండలంలోని ధర్మాజీపేట, మద్దిపడగ, లింగాపూర్, పెద్ద బెల్లాల్, అంబారిపేట్ లో గల ఆయా ప్రభుత్వ పాఠశాలల మైదానాల్లో వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయా గ్రామాల్లో వాలంటీర్లు ఈ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఈ శిబిరాలు ప్రతిరోజు ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, వీటిలో క్రీడలతో పాటు ఇతర విషయ పరిజ్ఞాన అంశాలు బోధించడం జరుగుతుందని తెలిపారు. ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదివే విద్యార్థిని విద్యార్థులు ఇట్టి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కేసీఆర్ సేవాదళం ఆధ్వర్యంలో అంబలి పంపిణీ

నవతెలంగాణ- ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో శనివారం కేసీఆర్ సేవాదళం అధ్యక్షుడు ఉబేద్ బిన్ యహీయా (తారిక్) ఆధ్వర్యంలో అంబలి పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు ఎమ్మెల్యే తనయుడు ఆత్రం అన్వేష్ మాట్లాడుతూ వార సంత సందర్భంగా జిల్లా కేంద్రానికి వివిధ మండలాల నుండి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి అంబలి పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి కాలంలో ఎండ విపరీతంగా పెరిగిన నేపథ్యంలో అంబలి దాహార్తిని తీరుస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, కాట్కర్ భీమ్రావు, అఫ్రోజ్, అబ్దుల్ తాసిం సైద్, అబ్దుల్లా, ముత్తు పాల్గొన్నారు

రెండో రోజుకు చేరుకున్న కార్యదర్శుల సమ్మె



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సర్వీసు క్రమబద్దీకరణ, ప్రొబిషనరీ కాలాన్ని సర్వీసుగా పరిగణించాలని, ఓపీఎస్‌లు, జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాలనే డిమాండ్లతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం రెండో రోజుకు చేరుకుంది. పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ నాలుగేళ్లు పూర్తయినా ఉద్యోగ భద్రత విషయమై ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని, గత్యంతరం లేక సమ్మెబాట పట్టామని వివరించారు. ఈ సమ్మెకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్ తదితరులు మద్దతు తెలిపి మాట్లాడారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హైకోర్టు న్యాయమూర్తి ఎం.జి ప్రియదర్శిని ఆదిలాబాద్ జిల్లాను సందర్శించిన సందర్భంగా పలువురు అడ్వకేట్లు కలిశారు. జిల్లా కేంద్రంలో శనివారం సంగెం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అడ్వకేట్ సంగెం సురేందర్ శాలువా మెమెంటోతో సత్కరించారు. గతంలో జిల్లా న్యాయమూర్తిగా పని చేసిన నేపథ్యంలో ఈ జిల్లాతో ఉన్న అనుబంధాన్నిర న్యాయమూర్తి గుర్తుచేసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో పని చేయడం సంతృప్తినిచ్చిందని తెలిపారు.

రేపు భవన నిర్మాణ కార్మికులకు మెగా మెడికల్ క్యాంపు

నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

కార్మికశాఖలో గుర్తింపు కార్డు పొందిన జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులకు మే 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు కార్మికశాఖ, సీఎస్‌సీ సెంటర్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు కార్మికశాఖ సహాయ కమిషనర్ శ్రావణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనం పక్కన భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంలో ఉదయం 10గంటల నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ శిబిరంలో సుమారు 50రకాల ఆరోగ్య పరీక్షలు చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లా కేంద్రంలో ముగియగానే మిగిలిన మండల కేంద్రాల్లోనూ క్యాంపులు ఏర్పాటుచేస్తామని వివరించారు. కార్మికులు లేబర్ గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు తీసుకొని శిబిరానికి వెళ్లాలని సూచించారు.

సింగరేణి, ఆర్టీసీలో ఎన్నికలు నిర్వహించాలి



నవతెలంగాణ- ఆసిఫాబాద్

సింగరేణి, ఆర్టీసీలలో గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, జిల్లాలోని అన్ని గ్రామాలలో 137వ మేడేను కార్మికులు, కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ కోరారు. శనివారం ఆసిఫాబాద్‌లోని ఎస్టియు భవన్ లో జిల్లా అధ్యక్షుడు దివాకర్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి, ఆర్టీసీలలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని అన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ రద్దు చేసి-44 కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పెండింగ్లో ఉన్న ఐదు జీవోలను గెజిట్ ఇచ్చి అమలు చేయాలని అన్నారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని ప్రతి కార్మికునికి పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాటివిటీ, బోనస్, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. హమాలి, ఆటో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సంక్షేమ చట్టాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ రంగ సంస్థలలో ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. గ్యాస్, డీజిల్ పెట్రోల్ నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని అన్నారు. స్కీం వర్కర్లందర్నీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 1995 పెన్షన్ చట్టాన్ని అమలు చేయాలని, కనీస పెన్షన్ రూ.10వేలు చెల్లించాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకరించరాదని అందులో పని చేస్తున్న కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, నాయకులు లోసరే దివాకర్, శ్రీకాంత్, భాస్కర్, షఫిక్ తో పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరిస్తున్న ఇద్దరి అరెస్ట్

- **ఆసిఫాబాద్ ఎస్పీ కే.సురేష్ కుమార్**

నవతెలంగాణ - కాగజ్‌నగర్

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మావోయిస్టు కార్యకలాపాలు సాగిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ కె.సురేష్ కుమార్ తెలిపారు. శనివారం కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కాగజ్‌నగర్ రూరల్ సిఐ నాగరాజు పెంచికల్‌పేట్ పోలీసులతో కలిసి ఈ నెల 28న అగర్‌గూడ గ్రామ శివారు గుట్టల వద్ద ఆకస్మిక తనిఖీ చేపట్టగా కొమురంభీం జిల్లా పెంచికల్పేట్ మండలం జిల్లెడ గ్రామానికి చెందిన కోట ఆనందరావు, నల్గొండ జిల్లా మునుగోడు మండలం కోరిటికల్ గ్రామానికి చెందిన చేన్నగొని గణేష్ అలియాస్ అభిరాం అలియాస్ సూర్యలు అనుమానాస్పదంగా ద్విచక్రవాహనంపై బెజ్జూర్ అటవీ ప్రాంతం వెళ్తుండగా పట్టుకున్నారు. వీరిని విచారించంగా సీపీఐ మావోయిస్టు పార్టీకి సానుభూతి పరులుగా పనిచేస్తున్నామని తెలిపారు. మావోయిస్టు పార్టీ దళంలో సభ్యులను రిక్రూట్ చేస్తున్నామని, మావోయిస్టులు వచ్చినప్పుడు వారికి వస్తువులు కొనిపెట్టటం, సామాగ్రి సరఫరా చేయడం, భోజనం పెట్టడం, కాంట్రాక్టర్ల వద్ద డబ్బులు వసూలు చేసి ఇవ్వడం లాంటి పనులు చేస్తున్నామని అంగీకరించారు. కోట ఆనందరావు వద్ద ఉన్న చేతి సంచిని తనిఖీ చేయగా ఐదు జెలటిన్ స్టిక్స్, 15 ఎలక్ట్రిక్ డెటోనేటర్స్, మావోయిస్టు సాహిత్యం, మొబైల్ ఫోన్, బైక్ స్వాధీనం చేసుకున్నారు. కాగా కోట ఆనందరావు పీజీ పూర్తి చేసి హైదరాబాద్‌లో అద్దె గదిలో ఉంటూ జీవనోపాధి కోసం క్యాటరింగ్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. దళం సభ్యులను చేర్చుకోవడం, వారికి వస్తువులు కొనుగోలు చేయడం, సరఫరా చేయడం, ఆహారం ఏర్పాటు చేయడం, పోరాటయోధులను పర్యవేక్షించడం లాంటి కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నాడు. చెన్నగోని గణేష్ హైదరాబాద్‌లోని అమృత కళాశాలలో హెూటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసి



హైదరాబాద్‌లో క్యాటరింగ్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఏడాది క్రితం వీరిద్దరు క్యాటరింగ్ చేస్తున్నప్పుడు పరిచయం ఏర్పడింది. గణేశ్‌ను మావోయిస్టు పార్టీలో చేరితే బాగుంటుందని కోట ఆనందరావు ప్రోత్సహించాడు. మావోయిస్టు పార్టీలో రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ఈ నెల 3న కోట ఆనందరావు, చేన్నగొని గణేష్‌ను హైదరాబాద్ నుండి తీసుకువచ్చి మావోయిస్టు పార్టీలో చేర్పించాడు. గణేష్ ఛత్తీష్‌గఢ్ అటవీ ప్రాంతంలో దళం వద్ద ఒక వారం పాటు పనిచేశాడు. దళానికి కావాల్సిన పేలుడు పదార్థాలు, పార్టీకి సంబంధించిన డాక్యుమెంట్స్ కోట ఆనందరావును కలిసి తీసుకొని రమ్మని మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ తెలుపగా ఈ నెల 11న హైదరాబాద్ వెళ్ళి కోట ఆనందరావును కలిశాడు. పేలుడు పదార్థాలు, సీపీఐ మావోయిస్టు పార్టీ పత్రాలను తీసుకురావడానికి వెళ్ళి వస్తుండగా 28న పోలీసులు పట్టుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) అచ్చేశ్వర రావు, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, పెంచికల్ పేట్ ఎస్సై విజయ్, కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా పాల్గొన్నారు.

మే డే వారోత్సవాలను జయప్రదం చేయాలి

- **పోస్టర్లు ఆవిష్కరించిన సీఐటీయూ నాయకులు**



నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

మేడే వారోత్సవాలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మేడేకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం కిరణ్ మాట్లాడుతూ ప్రపంచ కార్మిక ఐక్యతకు సంకేతం మేడే కార్మిక హక్కుల కోసం 8 గంటల పనిదినం కోసం కార్మికులు 1886 చికాగో హే మార్కెట్ లో కార్మికులు చేసిన పోరాటమన్నారు. కార్మిక వర్గం చేసిన అనేక పోరాటాల త్యాగాల ఫలితమే నేడు కార్మిక వర్గం అనుభవిస్తున్న హక్కులు చట్టాలన్నారు. కానీ నేడు కేంద్రంలో అధికారంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసే విధంగా విధానాలను రూపొందిస్తోందని 1926 సంవత్సరం స్వాతంత్ర్యానికి పూర్వం నుండి భారత కార్మిక వర్గం అనుభవిస్తున్న హక్కులను చట్టాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. 29 చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా కార్మికులకు ఉపయోగపడే అంశాలను సవరిస్తూ మార్చిందన్నారు. ఉపాధి ఉద్యోగ భద్రత కరువైందని, కార్మికులను మళ్లీ వేతన బానిసలుగా మార్చేలా 12 గంటల పనిదినాన్ని చట్టబద్ధం చేసిందన్నారు. కార్పొరేట్ల తాబేదారుగా ప్రభుత్వం పనిచేస్తుంది స్కీమ్ లను నిర్వీర్యం చేస్తున్నది పనిదినాలు నిజవేతనాలు పడిపోతున్నా కార్మికులను ఆదుకునే చర్యలేవి చేపట్టడం లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు చౌకగా కట్టబెడుతున్నదన్నారు. రాష్ట్రంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా కార్మికులకు కనీస వేతనాలు ఇచ్చే విషయంలో ఉపాధి భద్రత కల్పించడంలో నిర్లక్ష్యంగా ఉందన్నారు. 73 షెడ్యూల్డ్ పరిశ్రమల జీవోలను సవరించకుండా కార్మిక వ్యతిరేక విధానాలను కొనసాగిస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకై పునరంకితమవుతూ కార్మిక కర్షక ఐక్యతను ప్రదర్శించేలా మేడే వారోత్సవాలను జరపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, నాయకులు ఆర్.సురేందర్, పి.పొచ్చన్న, స్వామి, కె.రమాకాంత్ పాల్గొన్నారు.

నిర్దిష్ట సమయంలో పనులు పూర్తి చేయాలి

- **ఎమ్మెల్యే జోగు రామన్న**

నవతెలంగాణ- జైనథ్

పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టే పనులను నిర్దేశిత సమయం లోపు పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని ఎమ్మెల్యే జోగురామన్న ఆదేశించారు. పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని అధికారులు, గుత్తేదారులకు సూచనలు చేశారు. పి.ఆర్, ఎంఆర్ఆర్, ఎఫ్ఏఆర్ పనులకు సంబంధించి విస్తృతంగా చర్చించిన ఆయన... అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీరాజ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే సమీక్ష సమావేశం అనంతరం క్షేత్రస్థాయిలో పర్యటించారు. మండలంలోని నిరాల గ్రామంలో అధికారులతో కలిసి పర్యటిస్తూ.. చేపట్టనున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వరదల కారణంగా మరమ్మతులకు గురైన రహదారులు, వంతెనలపై చేపట్టనున్న పనులపై సూచనలు చేశారు. వరదల కారణంగా మరమ్మత్తులకు గురైన రహదారులు, వంతెనల పనులతో పాటు ప్యాచ్ వర్కుల కోసం ముప్పై అయిదు కోట్ల నిధులు మంజూరు అయ్యాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.



పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ సైతం పూర్తయిందని పేర్కొన్నారు. నిర్దేశిత సమయంలోపు పనులను పూర్తి చేయాల్సిందిగా గుత్తేదారులకు ఆదేశాలు జారీ చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమలో సర్పంచ్ సునంద ప్రభాకర్, పీఆర్ ఎస్ఈ వెంకట్రావ్, ఏఈ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మాలీలను ఎస్టీలుగా గుర్తించాలని పోరాటం

- **మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్**



నవతెలంగాణ- ఆసిఫాబాద్

గత 22 సంవత్సరాలుగా ఎస్టీ హెూదా కోసం పోరాడుతున్న మాలీలకు పూర్తిస్థాయిలో ఎస్టీ హోదా లభించే వరకు పోరాడుతూనే ఉంటామని మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే అన్నారు. అసిఫాబాద్ మండలం సాలెగూడా గ్రామపంచాయతీ పరిధిలోని పులాజి బాబా ధ్యాన మందిరం ముందర జరిగిన మాలీల ఆత్మ గౌరవ సభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేసి మాలీలకు ఎస్టీల హోదా కల్పించాలని కేంద్రానికి తీర్మానం పంపడం అభినందనీయమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా వెంటనే స్పందించి మాలిలకు ఎస్టీ హోదా కల్పించాలని తెలిపారు. అంత వరకు పోరాడుతూనే ఉంటామని వివరించారు. జిల్లా కేంద్రంలో మాలీల భవనం కోసం స్థలం కేటాయించడానికి సహకరించిన అధికార పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మాలీలంతా ఐక్య పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోవచ్చని పూలే దంపతుల జయంతి, వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలి బిన్ అహ్మద్, మార్కెట్ కమిటీ చైర్మన్ గాదవేణి మల్లేష్, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు రేగుంట కేశవరావు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు రూప్నర్ రమేష్, మాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు వాడగురే విజయ్, జిల్లా పటేళ్ల సంఘం అధ్యక్షులు నారాయణ షిండే, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు మెంఘాజీ, గ్రామ సర్పంచ్ ముంజం వినోద్, డ్రైవర్ యూనియన్ చాపిడి సురేష్, మాజీ సర్పంచ్ సోమేశ్వర్ శేండే, తులసి రామ్ కావుడే, వాంకిడి మండల అధ్యక్షులు వాడై బాపురావు, ప్రధాన కార్యదర్శి వాసు షిండే, కోశాధికారి కృష్ణన్ షిండే పాల్గొన్నారు.

ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకోవాలి

- **మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్**

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్వయం శిక్షణ కుట్టు మిషన్ తరగతులను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి దిశగా ప్రతి ఒక్కరు ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకోవాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం భాగ్యనగర్‌లో న్యాక్ సంస్థ ద్వారా మహిళలకు అందిస్తున్న కుట్టు మిషన్ శిక్షణ కేంద్రంలో ఏర్పాటుచేసిన సర్టిఫికెట్లు, మిషన్ల పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లతో పాటు మిషన్లను అందజేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ఇలాంటి ఉచిత శిక్షణ తరగతులను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా రాణించాలని సూచించారు. శిక్షణ పొందిన మహిళలకు అదిలాబాద్ మున్సిపల్ యంత్రాంగం తరపున స్వయం ఉపాధిలో మెరుగుపరచుకునేందుకు డ్వాక్రా, స్త్రీనిధి రుణాలు అందించి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. స్వయం ఉపాధిని ఆర్థిక లాభాలు గడించేలా దిన దినాభివృద్ధి సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు.



కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ అశోక్ స్వామి. పందిరి భూమన్న. మహిళా అధ్యక్ష కార్యదర్శులు స్వరూప రాణి, బొడగం మమత, కొండ గణేష్, సంజయ్ భూమన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని కనకపూర్ గ్రామానికి చెందిన రిపోర్టర్ రాజాగౌడ్ తల్లి ఇటీవల స్వర్గస్తులయ్యారు. బాధిత కుటుంబన్ని శనివారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు.కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. అధైర్యపడొద్దు అని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, ఆత్మ ఛైర్మన్ గంగారెడ్డి, బిఆర్ఎస్ మండల ఇంఛార్జి అల్లోల సురేందర్ రెడ్డి,జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి,సర్పంచ్ సుక్కు రాజవ్వ ముత్తన్నపిఏసిఎస్ వైస్ చైర్మన్ వెంకటరాజు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అత్యవసర సమయంలో రక్తదానం చేసి ప్రాణదాతగా నిలవాలని అదనపు డిఎంహెచ్ఓ శ్రీకాంత్ అన్నారు. శనివారం ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ సొసైటీ సౌజన్యంతో జిల్లా శాఖ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎడి రామారావు, పశు వైద్యాధికారి గోపికృష్ణ, ఉద్యోగులు, సొసైటీ అధ్యక్షుడు అజీజ్, పాల్గొన్నారు.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం

నవతెలంగాణ- నస్పూర్



మున్సిపల్ కార్యాలయం నందు చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశంలో 39 అంశాలను ప్రవేశపెట్టగా అన్ని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ ఏఈ మధు, మున్సిపల్ టిపిఎస్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థి ప్రతిభ

నవతెలంగాణ- లక్ష్మణచాంద



జేఈఈ మెయిన్స్‌లో మండల కేంద్రానికి చెందిన దూస చేతన్ జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి జనరల్ కేటగిరీలో 99.67 మార్కులతో 3860ర్యాంక్ సాధించారు.ఓ బి సి కేటగిరీలో జాతీయ స్థాయిలో 737 ర్యాంక్ సాధించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని సర్పంచ్ సురకంటి ముత్యంరెడ్డి, గ్రామస్తులు అభినందించారు. చిన్న పల్లెటూరు నుండి జాతీయ స్థాయిలో ర్యాంకు పొందడం ఆనందంగా ఉందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతిభావంతులైన విద్యార్థులను ఆదుకుంటాం

- **వైద్య విద్యార్థులకు స్కాలర్షిప్‌లు అందజేత**

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్థికంగా వెనుకబడి ఉండి చదువులకు దూరం కాకుండా ఉండేలా ప్రతిభావంతులైన వైద్య విద్యార్థులను ఆదుకోవడానికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తరపున స్కాలర్షిప్‌లను అందజేస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు డి.ఎన్ రావు పేర్కొన్నారు. ఇందులో భాగంగా శనివారం ఆదిలాబాద్ రిమ్స్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ తరపున 25 మంది వైద్య విద్యార్థులకు స్కాలర్షిప్‌లను ఆయన అందజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 8 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 25 మంది చొప్పున ఎంపిక చేసి వారికి ఏడాదికి రూ.20వేల చొప్పున స్కాలర్షిప్లు అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆదిలాబాద్ రిమ్స్ నుంచి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఆదిలాబాద్ (దస్నాపూర్) శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, శ్యాం ప్రసాద్, ప్రతినిధులు సుమలత, ఈద్రిస్ అక్బాని ఉన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

చెన్నూరు ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అధ్యక్షతన పట్టణంలోని స్థానిక ఠాగూర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషిచేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా కనిపించవని పేర్కొన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ రూ.35కోట్లతో చేపట్టిన క్యాతన్‌పల్లి రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులు 80శాతం పూర్తయ్యాయని తెలిపారు. పట్టణానికి ఉన్న 60ఏండ్ల విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రూ.1.90కోట్లతో నూతనంగా సబ్‌స్టేషన్ నిర్మించినట్లు తెలిపారు. 11వేల గృహాలకు విద్యుత్ సరఫరా జరుగుతుందని వివరించారు. వీటితో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు గుర్తుచేశారు. మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని రామకృష్ణాపూర్ మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిబిజికెఎస్ నాయకులు కెంగర్ల మల్లయ్య, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, జెడ్పీ చైర్మన్ నల్లాల భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.